క్లుప్తంగా

వైద్య శిబిరం రేపు

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ, ఆలకూరపాడు వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయపన్ను శాఖ అసిస్టెంటు కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సింమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రంలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణపు పనులను ఎంపీపీ వాకా వెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. గుండ్లసముద్రం ఓవర్‌హెడ్ ట్యాంక్ రోడ్ నుంచి ఆంజనేయస్వామి గుడివరకు దాదాపు 145 మీటర్లు పొడవున గడపగడపకు మన ప్రభుత్వం నిధులు దాదాపు రూ.8లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఏఈ జాలయ్య, ఇనుకొల్లు మాదిరెడ్డి, వాకా అంజిరెడ్డి, కిలారి ఆంజనేయులున్నారు.

ఇంటింటి సర్వేకు ఓటర్లు సహకరించాలి



సింగరాయకొండ: ఓటరు సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉష

సింగరాయకొండ: ఓటరు సర్వే చేసే బీఎల్ఓలకు సహకారం అందించాలని తహసీల్దార్ సి.హెచ్ ఉష విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయం-4 పరిధిలో బాలయోగినగర్ లో జరుగుతున్న ఓటరు సర్వేను శుక్రవారం తనిఖీ చేశారు. కొత్త ఓటరు నమోదు, పాత ఓటరు కార్డులో తప్పులు సరిచేయడం, ఒకే డోర్ నంబరు సరిచేయడం, వివాహమైన మహిళల ఓటు రద్దు చేయడం, చనిపోయిన వారి ఓటును తొలగించడం వంటివి బీఎల్ఓ లాగిన్ ద్వారా సరిచేసుకోవచ్చని తెలిపారు. రెండు జెరాక్స్ కాపీలు అందజేయాలని సూచించారు. పాతసింగరాయకొండ లో ఏఎస్ఓ శ్రీనివాసరావు తనిఖీ చేశారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



వెలిగండ్లలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామన తిరుపతిరెడ్డి

వెలిగండ్ల: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 వాల్‌పోస్టర్‌ను ఎంపీపీ రామన రామన మహాలక్ష్మి, ఎంపీడీఓ టి. సుకుమార్, ప్రజాప్రతినిధులు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, సర్పంచులు తాతపూడి సురేష్‌బాబు, కటికల రిబ్కా, గజ్జల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వై. నాగూర్ యాదవ్, యెలికె నారాయణ, బొబ్బా వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్ష పేపర్లు సిద్ధం



ప్రశ్నపత్రాలను దిగుమతి చేసుకుంటున్న సిబ్బంది

సింగరాయకొండ: మండలంలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఎఫ్‌ఏ-1 పరీక్షకు సంబంధించి పరీక్ష పేపర్లు సిద్ధంగా ఉన్నట్లు ఎంఈఓ బి. శివన్నారాయణ తెలిపారు. మండలంలో 49 ప్రభుత్వ, 12 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 8,900 మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం పరీక్షలు ఓఎమ్ఆర్ పద్ధతిలో జరుగుతుండటంతో ఆయా పాఠశాలలకు సంబంధించి పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్లు ఎంఆర్‌సీ కార్యాలయానికి శుక్రవారం చేరాయని ఆయా పాఠశాలలకు పంపనున్నట్లు ఆయన వివరించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీహరి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దప్పళంపాడులో ఉన్న మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న కందుకూరు సెబ్ సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి దాడి చేసి రెండు ఇసుక ట్రాక్టర్లును స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

మొక్కలతో పర్యావరణం పదిలం



పోట్లూరు నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ,అధికారులు



సింగరాయకొండ: మొక్క నాటుతున్న ఎంఈఓ శివన్నారాయణ



పీసీపల్లి: మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి

గుడ్లూరు: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు కోసం మొక్కలు నాటాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని పోట్లూరులో ఎన్ఈజీఎస్, నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రూ 6.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు ఒక చెట్టు తొలిగించిన ప్రదేశంలో రెండు మొక్కలు నాటేలా ఆదేశాలు జారీ చేశాయన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, సచివాలయాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటి పెంచడానికి గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని మొక్కలు తీసుకొని వెళ్ళి నాటించి వాటిని సంరక్షించాలన్నారు. లక్ష మొక్కల్లో 50 వేల మొక్కలు నాటడానికి డ్వామా అధికారులు ప్రణాళికలు వేస్తున్నారన్నారు. ప్లాంటేషన్ ఏపీడీ మృదుల, డ్వామా ఏపీడీ సంజీవరావు, ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్శిపాటి బాపిరెడ్డి, ఎంపీడీఓ చంద్రసేన్, సర్పంచ్ పూసపాటి సుబ్బరాజు, సొసైటీ చైర్మన్ రామక్రిష్ణ, ఏపీఓ రామాంజనేయులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు నాయుకులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించాలని ఎంఈఓ బి. శివన్నారాయణ అన్నారు. పాతసింగరాయకొండ పంచాయతీ మల్లికార్జుననగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్క నాటారు. కాలనీలోని మొక్కలను పంపిణీ చేశారు. హెచ్ఎం అర్రిబోయిన రాంబాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కోటపాటి నారాయణ, ఉపాధ్యాయులు సుధాకరరెడ్డి, రమణి, పంతగాని వెంకటేశ్వర్లు , సీఆర్‌పీ వంశీ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: గ్రామ సర్పంచ్ కత్తి రాజారావు, హెచ్ఎం జీవీ సురేష్‌బాబు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఒక్కొక్క మొక్క ఒక్కొక్క విద్యార్థికి కేటాయించి పెంచాలన్నారు. ఉపాధ్యాయులు బొబ్బరాజు సుబ్బారావు, విద్యా కమిటీ చైర్మన్ ఎలిక తిరుపతయ్య పాల్గొన్నారు.

మర్రిపూడి: ఎంఈఓ-2 డీ ప్రసాదు రెడ్డి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అధ్యాపకులు టీసీహెచ్ రంగయ్య, ఎస్‌కే కరిముల్లా, కె. లక్ష్మీనారాయణ, పూజల శ్రీనివాసులున్నారు.

పామూరు: ఎంపీడీవో ఊట్ల శ్రీనివాసులు, మండల రెండో విద్యాశాఖాధికారి గరికపాటి కరుణకుమారి.. లక్ష్మీనరసాపురం, వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకం నియంత్రణతోపాటు మొక్కలునాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ రెక్కల అనితారెడ్డి, హెచ్ఎం పి.వి.క్రిష్ణమోహన్, స్వయం కృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, వగ్గపల్లె సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, గద్దె సుధాకర్, అస్సాన్, జి.ప్రసాదరావు, సీఆర్‌పీ ఏలియా, జి.తిరుపతయ్య పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, ఎంపీడీవో ఈశ్వరమ్మ స్థానిక కేజీబీవీలో మొక్కలు నాటారు. బాధ్యత తీసుకుని నీరుపోసి సంరక్షించాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వారవుతారన్నారు. ఎంఈవో జె.ప్రసాదరావు, కేజీబీవీ ఎస్‌వో రహేన పాల్గొన్నారు.



కనిగిరి : మొక్కలు నాటుతున్న చైర్మన్ గఫార్, ఎంఈఓలు

వెలిగండ్ల: ఎంపీడీఓ టి. సుకుమార్ స్థానిక కస్తూర్బా పాఠశాల, మొగళ్లూరు హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, ఎంఈఓలు దాసుప్రసాద్, డి. రామిరెడ్డి, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ సుశీల, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కె. ఉప్పలపాడు (కొండపి): ఎంఈఓ- 2 పి. రామారావు కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో కమిటీ చైర్మన్ రాఘవ శర్మ, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రకృతిని మన పరిరక్షిస్తే తిరిగి ప్రకృతి మనల్ని రక్షిస్తుందన్నారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీఓ ఆర్. శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసరావు, మండల కన్వీనర్ గోపవరపు బొర్రా రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారు.

ఉలవపాడు: ఎంపీడీఓ చెంచమ్మ, ఎంఈఓలు ప్రసాదరావు, రమణయ్య స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మొక్కలు లేకపోవడం వలన వాతావరణ సమతుల్యత దెబ్బతుంటుందని హెచ్చరించారు.

కనిగిరి రూరల్: స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి శుక్రవారం మొక్కలు నాటారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీడీఓ జేవీబీ మల్లి కార్జునరావు, ఏఎంసీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. స్థానిక ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు.శుక్రవారం వివిధ పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఎంఈఓలు సంజీవి, యు. నారాయణరెడ్డి, కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు, సంస్థల ప్రతినిధులు, రమేష్, ప్రిన్సిపాల్‌గురుస్వామి, సంక్షేమ శాఖ అధికారి ఎం. రవిచంద్రారెడ్డి, పల్లా కోటి రత్నం, కిరణ్, మంద్రు రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ కత్తి రాజారావు



మర్రిపూడి: జూనియర్ కళాశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్న ఎంఈఓ-2 ప్రసాదు రెడ్డి



పామూరు: లక్ష్మీనరసాపురం జెడ్పీ హెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు



కనిగిరి: మొక్కలు నాటుతున్న ఏఎంసీ చైర్మన్ వైఎం సరితారెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి



వెలిగండ్ల కేజీబీవీలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ సుకుమార్



ఉప్పలపాడు హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఎంఈఓ- 2 రామారావు



ఉలవపాడులో మొక్కలు నాటుతున్న ఎంఈఓలు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఏడీ కేఎల్ఎస్ రెడ్డి

కనిగిరి రూరల్: వెనుక బడిన కనిగిరి ప్రాంతంలో పల్సస్ ప్రాసెసింగ్ యూనిట్‌కు ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదనపై పరిశీలనకు వచ్చినట్లు ఎంఎస్ఎంఈ ఢిల్లీ ఏడీ కేఎల్ఎస్‌రెడ్డి అన్నారు. రైతులతో ముఖా ముఖి, పరిశీలన కార్యక్రమం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగింది. ఏసీ కత్తి కళ్యాణ్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో పీడీ తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ వైకేపీ ద్వారా కనిగిరిలోని మినుము, కంది, పెసర రైతులకు మేలు చేకూర్చేందుకు ప్రాసెసింగ్ యూనిట్ రూ. 5కోట్లతో ఏర్పాటు చేసేందుకు కేంద్ర బృందం వచ్చినట్లు వెల్లడించారు. సుమారు 1200 మంది మహిళా రైతులకు సంబంధించి పరిశీలన కార్యక్రమం రెండు రోజుల పాటు జరుగుతుందని వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను రాయితీలను ఎఫ్‌బీఓ (రైతు ఉత్పత్తి దారుల సంఘాలు) సద్వినియోగం చేసు కోవాలన్నారు.

ఎమ్మెల్యే బుర్రాకు ప్రత్యేక కృతజ్ఞతలు

యూనిట్ ఏర్పాటుకు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిన ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్‌కు మహిళా రైతులు, అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. సెర్ప్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ సరళ, డీపీఎం లైవ్‌లీవుడ్ పి. డేవిడ్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఎంపీడీఓ జేవీబీ మల్లి కార్జునరావు, ఏపీఎం జీవరత్నం, వైకేపీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రానికి అంతా సిద్ధం



సింగరాయకొండ: దర్గాలో మొహర్రం వేడుకల్లో పాల్గొన్న వరికూటి



హాజీపురంలో గ్రామోత్సవంలో పీర్లు



మహమ్మదాపురంలో పెద్ద సరిగెత్తుకు పీర్ల చావిడిలో అలంకరించి సిద్ధంగా ఉంచిన పీర్లు



కనిగిరి: పీర్ల చావిడ్లలో పీర్లకు ప్రత్యేక పూజలు

హనుమంతునిపాడు: మొహర్రం వేడుకల్లో భాగంగా పెద్ద సరిగెత్తు నిర్వహణకు మండలంలోని హాజీపురం, హనుమంతునిపాడు, వాలిచర్ల, నందనవనం, వీరరాంపురం, జమాన్‌ఖాన్‌పల్లి, రామాయిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, మహమ్మందాపురం గ్రామాల్లో పీర్లను చావిడలో అలంకరించి సిద్ధంగా ఉంచారు. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. గ్రామోత్సవాల్లో ఇంటి వద్ద పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం వేడుకలను హిందులు, ముస్లింలు కలిసి భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఘనంగా మొహర్రం పెద్ద షరిగత్తు వేడుకలు

కనిగిరి రూరల్: ఇమామే హస్సేన్, ఇమామే హస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతిక గా నిర్వహించే మొహర్రం పెద్ద షరగత్తు వేడుకలను శుక్రవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. మయాన మకాన్, సయ్యద్ మకాన్, శంఖవరం, మంగలి మాన్యం, టకారి పాలెం, దేవాంగ నగర్ లతో పాటు, వివిధ గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో కొలువైన వివిధ నామకరణాలు కల్గిన పీర్ల (హజరత్)లకు ప్రత్యేక పూజలు చేశారు. పీర్ల చావిళ్ల వద్ద అగ్ని గుండాలను ఏర్పాటు చేశారు. స్థానిక మయాన మకాన్ వద్ద అన్నదాన కార్యక్రమం, ఎస్సై దాసరి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ధూళిపాళ్ల మురళీ వెంకట శర్మ ఆధ్వర్యంలో భక్తులకు వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. డీఎస్పీ ఆర్. రామరాజు పర్యవేక్షణలో సీఐ శివరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై దాసరి ప్రసాద్, పోలీసు సిబ్బంది బందోబస్తీ నిర్వహించారు.

సింగరాయకొండ: స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్ లోని దర్గా వద్ద జరుగుతున్న మొహర్రం వేడుకల్లో శుక్రవారం రాత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ కాలేషా, షేక్ సుల్తాన్, రియాజ్ పఠాన్, జి శ్రీహరిరెడ్డి, ముస్లిం సోదరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సింగరాయకొండ: అప్పుగా ఇచ్చిన డబ్బులు అడిగినందుకు కులం పేరుతో దూషించిన ఘటనలో శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదయింది. మండల కేంద్రంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పానుగోటి మల్లీశ్వరి 5 లక్షల రూపాయల మేర శ్రీధర్ అనే వ్యక్తి వడ్డీకి ఇచ్చింది. తరువాత అతనిని డబ్బులు అడిగినప్పుడల్లా వాయిదా వేస్తూ వస్తున్నాడని చివరికి ఈనెల 25 వతేదీ అతనిని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో కులం పేరుతో దూషించడంతో పాటు, చంపుతానని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొంది. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరామ్ వివరించారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలి

మర్రిపూడి: అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలంటూ మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని పన్నూరు రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 161-1లో 39.10 ఎకరాలు, 171-1లో 4.90, 172-1లో 23.40, 173-1లో 2.60, 177-1లో 5.29, 178-1లో 3.82. 180-1లో 7.04,185-1లో19.37, 206-1లో8.40, 209-1లో 10.49, 12-2లో 7.00, 204-1లో 11.35, 114-10లో 2.31, 115-2లో 4.96 ఎకరాల భూమి ఉంది. అయితే పన్నూరు వీఆర్‌ఓ అయిన డి. శివారెడ్డి రోడ్‌వెంబడి ఉన్న భూములు కొనుగోలు చేసి తన బంధువుల పేర్లు మీద రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఇటీవల సర్వే నెంబరు 169-1లో 39.10 ఎకరాలు భూమి మీదుగా గ్రీన్ ఫీల్డ్‌హైవే పోతున్నందున కొంత మంది రైతుల పేర్లు మీదు ఆన్‌లైన్‌చేసి తర్వాత ఆ రైతుల వద్ద భూములు కొనుగోలు చేశారన్నారు. ఎవరితో పని లేకుండా ఆన్‌లైన్ ఎక్కించుకున్నాడని వినతిపత్రంలో తెలిపారు. వీఆర్‌ఓ తెల్లపేపర్లపై సంతాకాలు సైతం చేయించుకున్నాడన్నారు. దాదాపు 150 ఎకరాల భూమిలో 28 మందికి నష్ట పరిహారం వచ్చేవిధంగా చేయాలని వినతి పత్రం ద్వార తెలియజేశారు. గోరంట్ల వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మణిపూర్ దాడులు బాధాకరం



చాకిచర్ల అంబేడ్కర్ అసోసియేషన్ నాయకుల నిరసన

ఉలవపాడు: మణిపూర్‌లో జరుగుతున్న దాడులు బాధాకరమని, ప్రభుత్వం వెంటనే భాధ్యులపై చర్యలు తీసుకోవాలని చాకిచర్ల అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ అన్నారు. శుక్రవారం నిరసన తెలిపారు. భాస్కరరావు, మల్లిఖార్జున, రాము, సతీష్, వినోద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రవికుమార్ పాల్గొన్నారు.

ఎంఈఓగా శ్రీనివాసులు



గుడ్లూరు ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును అభినందిస్తున్న అధికారులు

గుడ్లూరు: మండల విద్యాశాఖాధికారిగా కె.శ్రీనివాసులు స్థానిక ఎంఆర్సీ భవనంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న విద్యాశాఖాధికారి ప్రసాదరావు ఉలవపాడుకు బదిలీ కావడంతో ప్రకాశం జిల్లా శింగరాయకొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తున్న కె.శ్రీనివాసులును ఎంఈఓగా నియమించారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ చంద్రసేన్, ఎంఈఓ-2 గోవర్ధన్, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పొగాకు అత్యధిక ధర రూ. 271



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం కేంద్రం అధికారి ఎస్. రామారావు శుక్రవారం నిర్వహించిన వేలంలో అత్యధిక ధర కేజీ 271 రూపాయలు పలికింది. ఎస్ఎస్ కంద్రిక, పెట్లూరు, వర్ధినేనిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాల నుంచి 996 బేళ్ళు పెట్టారు. వ్యాపారులు 918 కొనుగోలు చేసి 74 బేళ్ళు తిరస్కరించారు. అత్యల్ప ధర రూ. 150 పలికి, సరాసరి ధర రూ. 250.89 దక్కింది.

టంగుటూరులో పొగాకు సరాసరి ధర రూ. 253

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం జరిగిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ. 253 పలికింది. కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 1082 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 1027 కొనుగోలు జరగ్గా.. 55 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 271 కాగా, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 253. 80 ధర పలికింది. 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కందుకూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రాల్లో కేజీ పొగాకు రూ. 271 పలికింది. ఈ సీజన్‌లో ఇదే ఇప్పటి వరకు అత్యధిక ధర కావడం గమనార్హం. దీనిలో భాగంగా కందుకూరు-1వ వేలం కేంద్రంలో 1181 బేళ్లను వేలానికి ఉంచగా 1108 బేళ్లు, కందుకూరు-2 వేలం కేంద్రంలో 1200 బేళ్లను వేలానికి ఉంచగా 1095 బేళ్లు అమ్ముడుపోయాయి.

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో అజయ్‌కుమార్

పామూరు: సమగ్రాత్మక, వాస్తవ ఓటరుజాబితా రూపకల్పనలో సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని కనిగిరి ఆర్డీవో తోట అజయ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం రాత్రి పామూరు తహసీల్దార్ ఆవుల సురేష్ అధ్యక్షతన పామూరు, సీఎస్ పురం మండలాల బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు సమగ్ర, వాస్తవ ఓటరుజాబితా రూపకల్పన పై సమీక్ష సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు ఆధార్ నంబర్ సేకరించాలని, విధిలేని పరిస్థితుల్లో మాత్రమే ఇతర గుర్తింపు కార్డు వివరాలు సేకరించాలన్నారు. ప్రతిరోజూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఓటరు వెరిఫికేషన్‌లో ఎటువంటి రాజకీయ నాయకుల ఒత్తిడులకు తలొగ్గవద్దని ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలని, నాయకులకు అనుకూలంగా ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యులు కాకతప్పదని హెచ్చరించారు. ముఖ్యంగా శాశ్వత మైగ్రేషన్, మృతుల ఓట్ల తొలగింపులో అప్రమత్తంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. తహసీల్దార్ ఆవుల సురేష్, ఆర్ఐ బి.మల్లికార్జున, ఈవోఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, ప్రసాద్, స్రవంతి, సుధాకర్, శ్రీను, బీఎల్‌వోలు పాల్గొన్నారు.